

## నర్సుల సేవలకు ఘన సత్కారం

**కారేపల్లి, నేడు న్యూస్ :** ఇంటర్నేషనల్ నర్స్ డే సందర్భంగా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి పల్లె దవాఖానలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సుల సేవలను గుర్తిస్తూ కేక్ కట్ చేసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని కో–ఆప్షన్ సభ్యుడు మోరపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో నర్సుల సేవలు అత్యంత కీలకమైనవని, గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో వారు చేస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. నర్సుల సేవాభావాన్ని గౌరవించడం సమాజ బాధ్యత అని ఆయన అన్నారు. పల్లె దవాఖాన నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు కూడా నర్సుల సేవలను ప్రశంసించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.





## నీట్ - 2026 పేపర్ లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుపై దాడి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎన్టీఏ ను ప్రక్షాళన చేయాలి
- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్‌ల డిమాండ్

**మేడ్చల్, నేడు బ్యూరో:** దేశ వ్యాప్తంగా కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ – 2026 పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ అత్యంత దారుణం, ఆందోళనకరమైనదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ. ఐ.వై.ఎఫ్ ) మేడ్చల్ జిల్లా సమితి మండిపడింది. రాజస్థాన్‌లోని సికర్ ప్రాంతం నుంచి ఈ లీక్ నెట్‌వర్క్ బయటపడినట్లు సమాచారం వచ్చిందని, వాట్సాప్ , టెలిగ్రామ్ ద్వారా ప్రచారం అయ్యాయని, తర్వాత అసలు ప్రశ్నపత్రంతో వాటిలో 100కు పైగా ప్రశ్నలు మ్యాచ్ అయ్యాయని ఆరోపణలు వచ్చాయని, పరీక్షలను సరిగ్గా నిర్వహించలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) ను ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్ లు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, దేశంలో ఇప్పటికే నిరుద్యోగం, కార్పొరేట్ విద్యా వ్యవస్థ, కోచింగ్ మాఫియా భారంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులపై ఇది మరో మోసపూరిత దాడి అన్నారు . పరీక్షకు ముందు ప్రశ్నపత్రం బయటకు రావడం, అనేక ప్రశ్నలు అసలు పరీక్షతో సరిపోవడం, తదనంతరం పరీక్ష రద్దు వరకు వెళ్లడం దేశ పరీక్షా వ్యవస్థ పూర్తిగా వైఫల్యానికి గురైందని స్పష్టం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) విద్యార్థుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయన్నారు . పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే, డబ్బు, అవినీతి, కోచింగ్ మాఫియా, రాజకీయ సంబంధాల ఆధారంగా కొందరికి ప్రశ్నపత్రాలు చేరడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఇది కేవలం పేపర్ లీక్ కాదని, విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే విద్యా మాఫియా కుట్ర అని విమర్శించారు. నీట్ –2026 పేపర్ లీకేజీపై సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరపాలని, లీకేజీకి పాల్పడిన మాఫియా, అధికారులు, మధ్యవర్తులు, సంబంధిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్.టి.ఏ లో జరుగుతున్న అవినీతి, నిర్లక్ష్యం, ప్రైవేటీకరణ ధోరణులపై పూర్తి స్థాయి ప్రక్షాళన చేపట్టాలన్నారు. విద్యార్థుల మానసిక వేదన, ఆర్థిక నష్టానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా బలమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కోచింగ్ కార్పొరేట్ మాఫియాపై కేంద్ర ప్రభుత్వం కఠిన నియంత్రణలు విధించాలని, దేశ విద్యార్థులు, యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న పాలకుల వైఖరిని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి, పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి–యువజన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## క్రీడా విజేతలకు ప్రోత్సాహం

**కారేపల్లి, నేడు న్యూస్ :** ఇటీవల గేట్ కారేపల్లిలో జరిగిన రెండు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన సింగరేణి గ్రామానికి చెందిన బీసీ కాలనీ క్రికెట్ టీంను గ్రామ సర్పంచ్ మేదరి టోనీ అభినందించారు. విజయం సాధించి గ్రామానికి గౌరవం తీసుకువచ్చిన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ రూ. 10,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ, గ్రామ యువత క్రీడా రంగంలో మరింత ముందుకు సాగాలని, ఇలాంటి విజయాలు భవిష్యత్తులో మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ గెలుపును గ్రామ యువత ఆదర్శంగా తీసుకుని మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. యువత అన్ని రంగాల్లో రాణించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సర్పంచ్ స్పష్టం చేశారు. గ్రామ పాలకవర్గం తరఫున యువ క్రీడాకారులను ప్రోత్సహించడం కొనసాగుతుందని తెలిపారు. రూ. 10,000 నగదు ప్రోత్సాహకాన్ని స్థానిక వార్డు మెంబర్ల చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రావుల రాజశేఖర్, గిరిబోయిన రాధ, రాబోత్ రమేష్, దామర్ల నాగరాజు, కాకాటి సాయి, ఫిరోజ్, బీసీ కాలనీ క్రికెట్ టీం సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం..
# పసిబిడ్డల ప్రాణాలకు శాపం!

- నిద్రమత్తులో ఆహార భద్రతా శాఖ
- 'విషం' చిమ్ముతున్న డెయిరీ ఫామ్‌లు
- హోటల్ వ్యర్థాలే మేతగా.. పాలలో యాంటీబయాటిక్స్ నిలయాలు !
- తనిఖీలు సున్నా.. వసూళ్లు మిన్న ?
- బిర్యానీ నుంచి ప్లాస్టిక్ వరకు.. పశువుల పొట్టలో అంతా చెత్తే !
- ఆరోగ్యంపై గొడ్డలి దెబ్బ... పాలు కాదు.. అది విషం!
- ఇప్పటికైనా కళ్లు తెరవరా?




**మేడ్చల్, నేడు న్యూస్ :** పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా, ఖర్చు తగ్గించుకోవడమే పరమావధిగా భావిస్తున్న కొందరు డెయిరీ యజమానులు, పాల వ్యాపారులు సామాన్య ప్రజలు, ముఖ్యంగా చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే కుళ్ళిన ఆహారాన్ని పశువులకు మేతగా వేస్తున్నా, బాధ్యత గల ఆహార భద్రతా తనిఖీ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న 'మర్మం' ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### తనిఖీలు సున్నా.. వసూళ్లు మిన్న?

మండలంలో వందలాది డెయిరీలు, పాల వ్యాపారులు ఉన్నప్పటికీ, ఆహార భద్రతా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. నిబంధనల ప్రకారం పశువులకు ఇచ్చే మేత స్వచ్ఛంగా ఉండాలి. కానీ, పట్టణాల్లోని డెయిరీల వద్దకు వెళ్లి పరిశీలిస్తే అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కేవలం కార్యాలయాలకేఅ పరిమితమై, మామూళ్ల మత్తులో జోగుతున్నందు వల్లే ఈ 'పాల విషతుల్యం' యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### పశువుల పొట్టలో అంతా చెత్తే! :

పశువులు శాఖాహారులు, కానీ నేడు వాటికి మాంసాహార వ్యర్థాలతో కూడిన ఆహారాన్ని పెడుతున్నారు. ఫంక్షన్ హాళ్లలో మిగిలిపోయిన, పులిసిపోయిన బిర్యానీని తక్కువ ధరకే కొనుగోలు చేసి పశువులకు పెడుతున్నారు. హోటళ్లలో వాడి పారేసిన నాణ్యత లేని నూనెలు, కుళ్ళిన కూరగాయలు పశువుల జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తున్నాయి.

### ఆరోగ్యంపై గొడ్డలి దెబ్బ... పాలు కాదు.. అది విషం!

పశువులకు ఇలాంటి 'వికృత మేత' వేయడం వల్ల వాటికి సోకే ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి యజమానులు విచ్చలవిడిగా యాంటీబయో టిక్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఈ రసాయనాల అవశేషాలు నేరుగా పాలలోకి చేరుతున్నాయి. ఈ పాలు తాగడం వల్ల చిన్నపిల్లల్లో హార్మోన్ల మార్పులు వచ్చి, అకాలంగా శారీరక ఎదుగుదల కనిపిస్తోంది. పాలలో ఉండే యాంటీబయోటిక్ అవశేషాల వల్ల భవిష్యత్తులో పిల్లలకు నిజంగా జబ్బు చేసినప్పుడు మందులు పనిచేయని ప్రమాదం ఉంది. కుళ్ళిన ఆహారం వల్ల పాలలో చేరే 'అఫ్లాటాక్సిన్' అనే విషపదార్థం దీర్ఘకాలంలో లివర్ మరియు కిడ్నీ వ్యాధులకు కారణమవుతోంది.

### ఇప్పటికైనా కళ్లు తెరవరా? :

కళ్ళ ముందే ఇంత దారుణం జరుగుతున్నా ఆహార భద్రతా శాఖ ఎందుకు మౌనంగా ఉంది ? కలుషిత పాల విక్రయ కేంద్రాలపై దాడులు నిర్వహించి, నమూనాలను సేకరించి ల్యాబ్ రిపోర్టులను ఎందుకు బయటపెట్టడం లేదు ? ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వ్యాపారులపై దాడులు చేసి సీజ్ చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

### మంత్రి పొంగులేటి, వాటర్ వర్క్స్ ఎండి, కలెక్టర్ కు ఎమ్మెల్యే బండారి వినతి

**చర్లపల్లి, నేడు న్యూస్:** డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ ఐజీ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీకారం చుట్టారు. 2009 సంవత్సరంలో జేఎన్యూఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని అన్నారు. చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు.



ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు, లోక్‌నాథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## తార్‌బండ్ శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** సికింద్రాబాద్ తాడు బండ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఆలయ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# అనుమతులు లేవు.. అడ్మిషన్లు ఫుల్

- నారాయణ స్కూల్ విద్యా వ్యాపారంపై విద్యాశాఖ మౌనం ఎందుకు?
- నిర్మాణ దశలోనే స్కూల్.. అప్పుడే అడ్మిషన్ల జాతర ఫుల్
- పిల్లల భవిష్యత్తుపై 'నారాయణ' చెలగాటం!
- విద్యాశాఖ అధికారుల మౌనం.. అంతా 'మామూలేనా'?
- తల్లిదండ్రులారా మీ పిల్లల భవిష్యత్తుపై తస్మాత్ జాగ్రత్త !



నిర్మాణ దశలో నారాయణ పాఠశాల భవనం



అనుమతి లేని పాఠశాలలో నారాయణ పాఠశాల పేరుతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుస్తకాలు


**మేడ్చల్, నేడు న్యూస్ :** విద్యా బుద్ధులు నేర్పాల్సిన విద్యా సంస్థలే నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలు మిన్నంటుతున్నాయి. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని అత్వెల్లి గ్రామంలో వెలుస్తున్న నారాయణ ప్రైవేట్ స్కూల్ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కనీస అనుమతులు లేవు, భవనం పూర్తి కాలేదు.. కానీ అప్పుడే వేలల్లో, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్ల దందాకు తెరలేపడంపై స్థానికులు మండిపడుతున్నారు.

### నిర్మాణ దశలోనే స్కూల్.. అప్పుడే అడ్మిషన్ల జాతర ఫుల్ :

సాధారణంగా ఒక పాఠశాల ప్రారంభించాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు తప్పనిసరి. కానీ, అత్వెల్లిలోని నారాయణ స్కూల్ యాజమాన్యం అవేవీ పట్టించుకోకుండానే అడ్మిషన్లు ప్రారంభించింది. పాఠశాల భవనం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. కనీస వసతులు కూడా లేవు. అయినప్పటికీ ఆడంబరమైన ప్రకటనలతో తల్లిదండ్రులను ఆకర్షిస్తూ భారీగా ఫీజులు గుంజుతోంది.



...ఉన్న పాఠశాల ప్రాంగణం



| GRADE :: 4th | 53000 |
|---|---|
| COURSE FEE | 58000 |
| ADMISSION FEE | 10000 |
| ADDITIONAL FEE | |
| APPLICATION FEE | 500 |
| BOOKS | 9600 |
| UNIFORM | 7500 |
| CAUTION DEPOSIT | 1000 |
| NLEARN APP | 1000 |
| SPORTS FEE | 500 |
| EVENTS & CELEBS | 1200 |
| EXAM FEE | 800 |
| | 90100 |

నారాయణ పాఠశాలకు అనుమతి లేకుండానే నాల్గవ తరగతికి డబ్బులు వసూలు చేస్తున్న ఫీజు రిసిప్ట్

ప్రతి సంవత్సరం మార్చి నెల ముగిసే సమయానికి అనుమతుల దరఖాస్తు గడువు ముగిసినా ఈ విద్యా సంవత్సరానికి మాత్రం ఇప్పటివరకు పాఠశాలకు సంబంధించి ఎటువంటి దరఖాస్తు గడువు పూర్తి కాలేదని తెలుస్తోంది.

### పిల్లల భవిష్యత్తుపై 'నారాయణ' చెలగాటం! :

అనుమతులు లేకుండా నడిపే పాఠశాలల్లో చేరితే విద్యార్థుల విద్యా సంవత్సరం వృధా అయ్యే ప్రమాదం ఉంది. అక్టోబర్ వరకు అనుమతులు వచ్చే అవకాశం లేకపోతే, ఈలోపు చదివే చదువుకు గుర్తింపు ఉంటుందా ? అన్నది ప్రశ్నార్థకం. ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు పత్రాలు లేకుండా విద్యార్థులకు ప్రమోషన్లు ఎలా ఇస్తారు ? ఉన్నత చదువులకు వెళ్లేటప్పుడు వారి సర్టిఫికెట్ల పరిస్థితి ఏమిటి ? కేవలం వ్యాపార దృక్పథంతో నారాయణ యాజమాన్యం చేస్తున్న ఈ పని విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమేనని మేధావులు విమర్శిస్తున్నారు.

### విద్యాశాఖ అధికారుల మౌనం.. అంతా 'మామూలేనా'?

కళ్ళ ముందే ఇంత పెద్ద విద్యాసంస్థ నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. "బడా బాబుల" సంస్థ కావడంతోనే అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారా ? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన క్షేత్రస్థాయి అధికారులు ఏసీ గదులకే పరిమితం కావడంతో, ప్రైవేట్ యాజమాన్యాలు సామాన్య మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయి.

### తల్లిదండ్రులారా తస్మాత్ జాగ్రత్త! :

పాఠశాల భవనం పూర్తి కాకుండా, ప్రభుత్వ అనుమతి పత్రాలను పరిశీలించకుండా కేవలం బ్రాండ్ పేరు చూసి లక్షలాది రూపాయలు ఫీజులు కట్టవద్దని విద్యా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీ పిల్లల భవిష్యత్తు ముఖ్యం, ప్రైవేట్ సంస్థల మాయమాటలు కాదని వారు సూచిస్తున్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి, అత్వెల్లిలోని ఈ అసంపూర్ణ పాఠశాలపై విచారణ జరిపి, అక్రమ అడ్మిషన్లను నిలిపివేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

